తిప్పర్తి చౌరస్తాను తీర్చిదిద్దుతా



తిప్పర్తి: నకిరేకల్-వజీరాబాద్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి



తిప్పర్తి అభివృద్ధి నమూనాను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- రూ.10కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తిప్పర్తి : తిప్పర్తి మండల కేంద్రంలోని చౌరస్తాను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. ఆర్‌అండ్‌బీ నిధులు రూ.10కోట్లతో శనివారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. తిప్పర్తి చౌరస్తాలో అంబేద్కర్ క్యాంస విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. చౌరస్తా చుట్టూ చిరు వ్యాపారులకు శిల్పాకళా వేదికల దుకాణాలు ఏర్పాటు చేయిస్తానన్నారు. త్వరతగతిన పనులు చేపట్టి దసరా నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

డిస్ట్రిబ్యూటరీలకు నేటి నుంచి నీటి విడుదల

మండలంలోని డి-37, 39, 40, 41డిస్ట్రిబ్యూటరీలకు ఆదివారం నుంచి నీటిని విడుదల చేసి చెరువులు నింపుతామని మంత్రి చెప్పారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు. సరైన వర్షాలు లేకున్నా ఎగువన కురిసిన వర్షాలకు సాగర్ జలాశయం గరిష్ట నీటి మట్టానికి చేరుకుందని పేర్కొన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా గత 15రోజులుగా 13 మిషన్‌లు పెట్టి కాలువల్లో పేరుకుపోయిన చెత్త, పూడిక తీత పనులు చేయిస్తున్నట్లు తెలిపారు.ప్రత్యేక చొరవ తీసుకొని చెరువులు నింపాలని కలెక్టర్ నారాయణ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో ఎంపీ రఘువీర్‌రెడ్డి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, నల్లగొండ ఆర్డీఓ రవి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు అందజేత

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ మండలం పెద్ద సూరారం గ్రామానికి చెందిన ఎన్నారైలు ఏడుదొడ్ల శ్రవణ్‌కుమార్‌రెడ్డి -సృజన, ఏడుదొడ్ల ఓంప్రకాశ్‌రెడ్డి-హిందు సహకారంతో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు జాకటి పూజిత, గాదె స్ఫూర్తికి శనివారం తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ల్యాప్‌ట్యాప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసి ఉద్యోగం పొందడమే కాకుండా పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ ఎంవీ. గోనారెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, ఏడుదొడ్ల వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మంత్రి 'తుమ్మల'కు ఘన స్వాగతం

నల్లగొండ: నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయానికి మొదటిసారిగా వచ్చిన రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. మంత్రి తుమ్మలకు బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. మంత్రికి స్వాగతం పలికిన వారిలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ పాశం రామ్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కనగల్ మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మీశ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

శాలిగౌరారం: విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమ శిక్షణతో విద్యానభ్యసించాలని సీవీఎన్ రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధి చామల వెంకటరమణారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం గడిచిన ఎస్సెస్సీ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డాక్టర్ చామల వెంకటనర్సింహారెడ్డి(సీవీఎన్ రెడ్డి) ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి పోటీతత్వ సమాజంలో ఉపాధ్యాయులు బోధించే పాఠాలు ఏకాగ్రతతో విని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్సెస్సీ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన బొడ్డు యజ్ఞశ్రీ, అనుముల స్పందన, సూరారం మత్స్యగిరి రూ.7500లు నగదుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అదే విధంగాపాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులకు నారగోని రవి, డెంకెల వెంకన్న, దాచవరం జగదీష్‌బాబులు టైలు, షూలు, బ్యాడ్జీలు అందజేశారు. అదేవిధంగా క్రీడల్లో రాణించిన విద్యార్థులకు కల్లూరి నాగరాజు, బండారు మహేశ్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోట మల్లయ్య, ఫిజికల్ డైరెక్టర్ జ్యోతి, స్థానికులు బుడిగె శ్రీనివాసులు, జమ్ము శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వెంకటరమణారెడ్డి

క్లుప్తంగా

వంట మనిషి ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

మునుగోడు: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ వంట మనిషి ఉద్యోగానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల విద్యాధికారి నర్సింహ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారురాలు మునుగోడు మండలానికి చెందిన వారై ఉండి 7వ తరతగతి ఉత్తీర్ణురాలై వంట చేసే అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 24వ తేదీ లోపు స్థానిక కస్తూరిబా పాఠశాల ప్రత్యేక అధికారి వసంతకు అందజేయాలని ఆయన కోరారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం



డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్ రామచంద్రం

చిట్యాల: డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డిని చిట్యాల మండలం గుండ్రాంపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ దోర్నాల రామచంద్రం శనివారం హైదరాబాద్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాపన్న జయంతి వేడుకలను జయప్రదం చేయాలి

మర్రిగూడ : హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈనెల 18న నిర్వహిస్తున్న సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ జయంతి వేడుకలకు ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని సర్వాయి పాపన్న సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు లింగంగౌడ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న పాపన్నగౌడ్ జయంతి వేడుకలకు గౌడ కులస్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రావుల వెంకటేష్‌గౌడ్, ఎరుకుల శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

ఆశ్రమంలో పండ్లు పంపిణీ

నకిరేకల్ : నకిరేకల్‌లోని ప్రముఖ అలీ ఆర్ట్స్ పెద్ద కుమార్తె అలీషా జయంతి సందర్భంగా శనివారం స్థానిక లయన్స్ క్లబ్ వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేత ఆవుల వేణు,వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపకరణాలు దివ్యాంగులకు చేయూత



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

నల్లగొండ : ఉపకరణాలు దివ్యాంగులకు చేయూత అని జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్ వంగూరి వీరయ్య అన్నారు. ఆయన శనివారం జిల్లా విద్యా సమగ్ర శిక్ష, కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ఆధ్వర్యంలో డైట్ కాలేజీలో దివ్యాంగులకు అవసరమైన ఉచిత పరికరాల అందజేతకు చేసిన నిర్ధారణ పరీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ భిక్షపతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 18 సంవత్సరాల లోపు గల 180 మందిని పరీక్షించి వారికి చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలను అలీంకో కంపెనీ తయారు చేసి అర్హులకు మరో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆశీష్‌కుమార్, మహేంద్ర ప్రశాంత్‌సింగ్, రోహిత్‌శర్మ, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



ఎలికట్టెలో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

చిట్యాల: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిట్యాల పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని ఎలికట్టె, నేరడ గ్రామాల్లో శనివారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమున్న వారికి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఏ నర్సింగరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

మిర్యాలగూడ అర్బన్ : 'మిషన్ పరివర్తన్'లో భాగంగా విమిర్యాలగూడ టూటౌన్ పోలీసులు మాదక ద్రవ్యాలపై పట్టణంలోని శివానీ హైస్కూల్ విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ నాగార్జున మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, షీటీం, డయల్ 100 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శివానీస్కూల్ యాజమాన్యంతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ యూత్ కోఆర్డినేటర్

శాలిగౌరారం : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన రెడ్‌క్రాస్ జిల్లా యూత్ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం హైదరాబాద్‌లో కలిసారు. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షుడు గోలి అమరేందర్‌రెడ్డి నేతృత్వంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాల గురించి వివరించారు. సంస్థ చేపడుతున్న సేవలు ప్రజలకు ఉపయోగకరంగా ఉండాలని గవర్నర్ పలు సలహాలు, సూచనలు చేసినట్లు శ్రీనివాసరెడ్డి విలేకరులకు తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



ప్రశంసాపత్రాలతో చిన్నమాదారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు

కనగల్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని చిన్న మాదారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ ఉపాధ్యాయులను కోరారు. శనివారం 'అవ్వ తాతలకు ఉత్తరం రాద్దాం రండి' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఉత్తరాలు రాయడం ఒక కళ అని వివిధ సమస్యల పట్ల ఉత్తరాలు రాసిన తీరు బాగుందని విద్యార్థులను ప్రశంసించారు. సృజనాత్మకతతో ఉత్తరాలు రాయడంలో అవగాహన కల్పించిన బుచ్చిరెడ్డి కృషి అభినందనీయమన్నారు. అనంతరం ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శిల్పశాల కన్వీనర్, రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, మహ్మద్ ఇజాజ్, రమేష్ రెడ్డి, వాసు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం వేడుక

నకిరేకల్ : నకిరేకల్‌లో శ్రీశైవక్షేత్ర వనితా శక్తి ఇంటర్నేషనల్ (ధర్మోరక్షిత ట్రస్ట్) ఆధ్వర్యంలో పద్మాదేవి అమ్మవారి ఒడి బియ్యం కార్యక్రమాన్ని శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.స్థానిక కందగట్ల సుష్మ, శ్రీధర్ ఇంటి వద్ద నుంచి అమ్మవారి ఒడి బియ్యం కలిపే కార్యక్రమం నిర్వహించారు. అక్కడి నుంచి ఒడి బియ్యంతో శ్రీవేంకటేశ్వర దేవాలయానికి చేరుకుని పద్మాదేవి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆసంఘం అధ్యక్షురాలు రేపాల పరిమళ,ప్రతినిధులు ఉప్పల ప్రమీల, శ్రీకాకుళ హైమావతి, కందగట్ల సుష్మ,ముప్పారం జ్యోతి, ఉప్పల సులోచన పాల్గొన్నారు.



ఆలయంలో ఒడి బియ్యంతో భక్తులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ఆటోడ్రైవర్లకు సూచనలు చేస్తున్న సీఐ

చండూరు : ఆటోడ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ వెంకటయ్య అన్నారు. ఆయన శనివారం చండూరు పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆటో నడిపే ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్, ప్రమాద బీమా కలిగి ఉండాలన్నారు. రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలు ఆపి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించవద్దాన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● పాఠశాలల్లో రాఖీ వేడుకలు

నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, కట్టంగూర్, చిట్యాల, శాలిగౌరారం మండలాల్లోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం రాఖీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.



నకిరేకల్: విద్యార్థులతో కృష్ణవేణి స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్య



రాఖీ వేడుకలో పాల్గొన్న శాలిగౌరారం జేఎంజే పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు



కట్టంగూర్ : సాందీపని స్కూల్‌లో విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు



చిట్యాల : వెలిమినేడులోని విజయవాణి హైస్కూల్‌లో రాఖీ వేడుకలో విద్యార్థులు

డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను శిక్షించాలని ర్యాలీ



నల్లగొండ గడియారం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న గ్రామీణ వైద్యులు



నకిరేకల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు, వైద్యసిబ్బంది

నల్లగొండ టౌన్ : కోల్‌కతాలో వైద్యురాలిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యులకు అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పానుగోటి హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు డీఎస్ఎన్‌చారి, నర్సిరెడ్డి, కృష్ణారెడ్డి, నజీరుద్దీన్ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన

కోల్‌కతాలో పనిచేస్తున్న మహిళ డాక్టర్‌ను అమానుషంగా హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ మాట్లాడుతూ దేశంలో ప్రతిరోజు ఆడపిల్లలపై లైంగికదాడులు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కార్లపూడి రాము, సురవరం శివ, యువరాజ్, నవీన్, శ్రీకాంత్, హనుమంతు శ్రీనివాస్, జానీ, నరేష్, శంకర్, అనిల్ పాల్గొన్నారు.

డాక్టర్ల సమ్మెకు మద్దతు

కోల్‌కతా ఘటనను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా సాగుతున్న డాక్టర్ల సమ్మెకు సీపీఎం మద్దతు ప్రకటిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో మహిళా డాక్టర్లు, నర్సులు ఇతర మహిళా స్టాఫ్‌కు భద్రత కల్పించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. దోషులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.



చిట్యాల : కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా ప్రతినిధులు



మర్రిగూడలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యసిబ్బంది

నకిరేకల్‌లో నిరసన

నకిరేకల్ : కోల్‌కతాలో మహిళా డాక్టర్ దారుణ హత్యను ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 24 గంటల పాటు వైద్యసేవలను నిలిపివేస్తూ డాక్టర్లు, వైద్య సిబ్బంది నల్లబాడ్జీలతో నకిరేకల్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. మెయిన్ సెంటర్‌లో మానహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నకిరేకల్ యూనిట్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రాపోలు రఘునందన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతం రెడ్డి మాట్లాడారు. మహిళా డాక్టర్‌పై సాముహికరంగా లైంగిక దాడి కి పాల్పడి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు చెరుకు సుధాకర్, వీరబ్రహ్మం, రాపోలు మంజుల, సుష్మ, ఇచ్చిమల్ల అమృతరావు, పూర్ణచంద్ర, శ్రీనాథ్‌నాయుడు, సోమ సంతోష్, సుష్మిత, రమేష్, దివ్య, శ్రీకాంత్, వెంకటరమణ,శ్రీను, మెడికల్ సిబ్బంది పహిం, రాందాస్ పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

చిట్యాల: వైద్యురాలి మృతికి కారకులైన వారిని గుర్తించి వెంటనే కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ డిమాండ్ చేశారు. చిట్యాలలో శనివారం రాత్రి ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెంగాల్ తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసే అరాచకాలను నిలువరించకపోవటం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఆ సంగం నాయకురాళ్ళు బొల్గూరి రాధిక, జిట్ట రమాదేవి, మనీషా, ఇందిరా, ప్రియాంక, లక్ష్మి, యాదమ్మ, అలివేలు, ప్రియదర్శిని పాల్గొన్నారు.

మర్రిగూడలో ఓపీ సేవలు బంద్

మర్రిగూడ: కోల్‌కతా నగరంలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా మండల కేంద్రంలోని సీఎస్సీ ఆసుపత్రిలో వైద్యులు ఓపీ సేవలు నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, సిబ్బంది మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. తిరిగి ఇలాంటి సంఘటనలు జరగకుండా మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులు

నకిరేకల్ : బంగ్లాదేశ్‌లో హిందువులపైన జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో శనివారం రాత్రి నకిరేకల్ పట్టణంలో భారీ శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇందిరా గాంధీ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారులు గుండా సాగింది. ఈ ర్యాలీలో ఆయా హిందూ సంఘాల ప్రతినిధులు, ప్రజలు స్వచ్ఛందగా పాల్గొని నిరసన తెలిపారు.

అంబేద్కర్ యువజన కమిటీ అధ్యక్షుడిగా ప్రశాంత్



శాలిగౌరారం: మండలంలోని తుడిమిడి గ్రామ అంబేద్కర్ యువజన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బట్టు ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా చింత నర్సింహ, కార్యదర్శిగా బట్టు రమేశ్, కోశాధికారిగా బట్టు సైదులు, కార్యవర్గ సభ్యులుగా బట్టు జానయ్య, బాకి బుచ్చయ్యలతో పాటు గౌరవ అధ్యక్షుడిగా చింత సాయిలు, బాకి వెంకన్నను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యువజన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా ఇరిగి కుమార్

చండూరు : బీజేపీ ఎస్సీ మోర్చా పట్టణ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా ఇరిగి కుమార్, ప్రధాన కార్యదర్శులుగా దుబ్బ గణేష్, పేర్ల గురుస్వామి, ఉపాధ్యక్షులుగా నల్లగంటి కిరణ్, మర్రి నరేష్, దుబ్బ ఉపేందర్, అన్నెపర్తి శ్రీకాంత్, కార్యదర్శులుగా ఇరిగి నాగేంద్రబాబు, పర్వతం నరేష్, అన్నెపర్తి దయాకర్ కోశాధికారిగా అన్నెపర్తి స్వామి, కార్యవర్గ సభ్యులుగా మస్క శివ, అన్నెపర్తి దశరథ, తీగల శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు సత్యం గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి అన్నెపర్తి యాదగిరి నాయకులు ఇరిగి లక్ష్మయ్య, యువమోర్చా జిల్లా నాయకులు సోమ శంకర్, పేర్ల గణేష్, వేముల పవన్, భూతరాజు వేణు, సోమ రాజు, గండూరి మల్లేష్, సంగెపు సాయి తదితరులు పాల్గొన్నారు.



చండూరులో నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రోత్సాహకాలు అందజేత

నకిరేకల్ : నకిరేకల్ మండలం మంగళపల్లిలో జెడ్పీ హైస్కుల్లో పదవ తరగతితో 10/10 గ్రేడ్ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అయితగోని తేజస్వీ ,కందికంటి శివానీలకు శనివారం నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.4500 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఆ క్లబ్ అధ్యక్షుడు బిచేనేపల్లి ప్రకాష్‌రావు, నవ క్లబ్ అధ్యక్షురాలు ఎస్.రమాదేవి, ప్రతినిధులు ఎస్.రాంమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలు అందజేస్తున్న ప్రకాష్‌రావు

మృతురాలి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మునుగోడు: మండల కేంద్రాకి చెందిన గోలి సంతోషమ్మ శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. మునుగోడులో జరిగిన ఆమె అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ హాజరయ్యారు. ఆమె మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.